


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 | సంచిక : 24 | పుష్పం : 51-52 | 05-9-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 24

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 13-04-04, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం గృహస్థుగా ఉన్నప్పుడు గృహస్థధర్మం పాటించాలి, సన్యాసం తీసుకొంటే సన్యాసధర్మం పాటించాలి. మనం ఏ ఆశ్రమంలో ఉంటే ఆ ఆశ్రమధర్మం పాటించాలి. మనకు గృహస్థాశ్రమంలోకొన్ని ఆటంకాలు వస్తాయి, సన్యాసాశ్రమంలో కొన్ని ఆటంకాలు వస్తాయి. ఇలా వస్తున్నాయి ఏమిటి అని మనం అనుకొంటాము కాని భగవంతుడికి తెలియకుండా ఆవిఘ్నాలు రావటంలేదు. మనం రమ్మని వాటిని ఆహ్వానించలేదు అందుచేత పొమ్మని అనవద్దు, ఉదాసీనంగా ఉంటే సరిపోతుంది. దేహప్రారబ్ధాన్ని బట్టి ఆవిఘ్నాలు వస్తూఉంటాయి. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి మనపని మనంశ్రద్ధగా చేసుకొంటే మనకు మోక్షం కలుగుతుంది. గుణాలువచ్చి మననెత్తిమీదపడుతూ ఉంటాయి. ఆగుణాలు వచ్చినప్పటికి కూడా ఎవడైతే నిర్గుణంగా ఉండగలుగుతున్నాడో, ఎవడైతే వికారం లేకుండా ఉండగలుగుతున్నాడో వాడు ఆత్మజ్ఞానం పొందటానికి అర్హుడవుతాడు. మనం ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి ఎందుచేతనంటే మనం తినేఆహారం యొక్క ప్రభావము శరీరం మీద, మనస్సు మీద ఉంటుంది. మా గ్రహస్థితి బాగాలేదు అని చాలామంది చెపుతూఉంటారు. గ్రహస్థితి బాగాఉన్నా, బాగాలేకపోయినా అది దేహానికి సంబంధించిన విషయమే. ఈదేహం పుడుతుంది, పెరుగుతుంది, చనిపోతుంది. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టు, దాని తాలుక వికారములన్నీ మనస్సులోనికి రానివ్వవద్దు. మనంపొందవలసింది మన హృదయంలోనే ఉంది, అదేసత్యం, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే మన జీవితగమ్యం. మనలను పీడించే గ్రహం మన అహంకారమే, మన మనస్సు మన స్వాధీనంలో ఉంటే, మనకు ఇంద్రియనిగ్రహం ఉంటే, మనం శాంత చిత్తం కలిగిఉంటే ఏగ్రహాలు మనలను ఏమీ చేయలేవు. నిజమైన స్నేహితుడు మనకు ఎలా సహకరిస్తాడో, స్వాధీనమైన మనస్సు మనకు అలా సహకరిస్తుంది. మన శత్రువులు మనలను ఎలా ఇబ్బంది పెడతారో స్వాధీనంలోలేని మనస్సు మనలను అలా ఇబ్బంది పెడుతుంది. బంధానికి, మోక్షానికి మన మనస్సే కారణం. అందుచేత మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కాపాడుకొంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ, మంచిగ్రంధాలు అధ్యయనం చేస్తూ, జపతపములు తోటి జీవితం గడుపుతూ, నీ బాధ్యతలను ఆసక్తిలేకుండా నిర్వర్తిస్తూ ఉంటే మనకు మోక్షంకలుగుతుంది. మనం మనస్సు అనే గ్రహం నుండి విడుదలపొందితే బయటగ్రహాలు మనలను ఏమీ చేయలేవు. అందుచేత మనస్సును నియమించుకోవాలి, మనస్సును మిత్రుడుగా చేసుకోవాలి, మనస్సును స్వాధీనం చేసుకొనే ప్రయత్నంచేయాలి. మనం సత్కర్మ చేస్తూ కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఉంటే మనమనస్సు జ్ఞానం పొందటానికి సమాయత్తం అవుతుంది, ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. ఎలక్షన్‌లో నిలబడినవారు నెగ్గటానికి రాత్రి అనక, పగలు అనక ఎంత కష్టపడతారోచూడండి, మరి మనం ఈ జననమరణ చక్రం నుండి బయటపడటానికి ఎంత ప్రయత్నంచేయాలో ఆలోచించుకోండి. మనకు మోక్షం పొందాలి అని ఉంది, కాని దానికి తదనుగుణంగా సాధనచేయటం లేదు, ప్రయత్నం చేయటం లేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మిధ్యానేను నుండి విడుదలపొందాలి, అదే మనజీవితగమ్యం. ఈమిధ్యానేనులో నుండి విడుదలపొందటానికే సదాచారం, సద్గుణాలు ఇవి అన్నీ పెట్టారు. మనస్సుకు లోచూపురావటానికి, వివేకంపెరగటానికి, జీవితాన్ని సరిదిద్దుకోవటానికి, మధ్యేమార్గంలో ప్రయాణం చేయటానికి భక్తి అవసరం. భక్తి లేకుండా ముక్తి కలుగదు. భక్తిని ఆలంబనగా చేసుకొని జ్ఞానాన్ని సంపాదించు అని ఆచార్యులవారు చెప్పారు. వారిమీద, వీరిమీద నువ్వుకోపం తెచ్చుకోవటం కాదు, నీకోపం మీద కోపం తెచ్చుకో అన్నారు భగవాన్. రామచంద్రమూర్తికి అన్నీ కళ్యాణగుణాలే. మనం కళ్యాణ గుణాలను ఎందుకు అలవర్చుకోవాలి అంటే, కళ్యాణగుణాల వలన కోపం తగ్గుతుంది, రాగం తగ్గుతుంది, భయంతగ్గుతుంది, వివేకం పెరుగుతుంది, విచక్షణ పెరుగుతుంది. బ్రహ్మాం ఎక్కడో ఉంది

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**


13-04-04 భీమవరం .................... 1
08-008-04 జిన్నూరు .................... 8

అనుకొంటున్నారు బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది. అది ఎప్పుడో తెలుస్తుంది అనుకొంటున్నావు కాని ఇప్పడే తెలుస్తుంది, నీవు గుణాలనుండి విడుదలపొందితే, మనోనాశనమైతే ఇప్పడే, ఇక్కడే బ్రహ్మంనీకు అనుభవంలోనికి వస్తుంది. ఇప్పడు నేను శాంతిగా ఉన్నాను అనుకోండి, ఈశాంతికి బాహ్యకారణాలు ఏమీ కన్పించటంలేదు అనుకోండి, అది నిజమైనశాంతి, బాహ్యకారణాల వలన నీకు శాంతి వస్తూఉంటే భవిష్యత్‌లో అదిఅంతా అశాంతి కింద మారిపోతుంది. శరీరానికి కంఫర్టు ఎంతముఖ్యం అనుకొంటున్నావో మనస్సుకు నిగ్రహం కూడా అంతే ముఖ్యం. మనస్సుకు నిగ్రహం లేకపోతే దానికిలోచూపు రాదు, లోచూపు లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. మనకు అనేక సంకల్పాలు వస్తూఉంటాయి, మనసంకల్పం జరుగదు, ఈశ్వరసంకల్పం జరుగుతుంది. ఏప్రారబ్దం అనుభవించటానికి భగవంతుడు మన దేహాన్ని ఇక్కడకు పంపించాడో, ఏ సంకల్పంతో ఇక్కడకు పంపాడో ఆ సంకల్పానికి మనం సహకరిస్తూ ఉంటే మనకు ఈజన్మలోనే మోక్షంకలుగుతుంది, ఈశ్వరసంకల్పాన్ని గౌరవించేశక్తి నీకు కలుగుతూ ఉంటే ఈ జన్మలోనే తరిస్తావు, సాధన వలన ఈశ్వరసంకల్పాన్ని విశ్వసించే శక్తి నీకు కలుగుతుంది. నాకు సన్మానాలు ఎవరుచేస్తారు, నన్ను ఎవరు గౌరవిస్తారు అని కనిపెట్టుకొని ఉంటే వాడికి జ్ఞానంరాదు, వాడికి దేహబుద్ధి పెరుగుతుంది, రజోగుణం పెరుగుతుంది. ముందు మనం రజోగుణాన్ని, తమోగుణాన్ని తగ్గించుకోవాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసుచేయాలి, సత్వగుణాన్ని ప్రాక్టీసుచేయగా చేయగా ఆగుణంలో నుండి విడుదలపొందుతాము, అప్పడు నిర్గుణస్థితి మనకు కలుగుతుంది. అగ్నికి నెయ్యి ఆహుతిచేసేకొలది అది పెరుగుతూ ఉంటుంది అలాగే భోగాలను అనుభవించేకొలది భోగం పెరుగుతుంది. నీకు ఇక్కడ అనుభవించే భోగాలు సరిపోవటంలేదు, చనిపోయిన తరువాత కూడా భోగాలు అనుభవించాలి అని స్వర్గలోకం కోరుకొంటున్నావు. ఇదంతా నీలోపల ఉన్న అజ్ఞానానికి గుర్తు. నీవు స్వర్గలోకానికి వెళ్ళాలి అనుకొంటున్నావు, ఆ వెళ్ళేవాడు ఎంతనిజమో స్వర్గం కూడా అంతేనిజం. నీ జీవితగమ్యం అదికాదు. జీవితానికి మరణానికి బేధం తెలియని స్థితిని పొందాలి, ఆస్థితిని పొందటానికి నీవు కనీసం ప్రయత్నం చేయటంలేదు. నీవు కోరిక పెట్టుకొని ఏదైనాపనిచేస్తే ఫలితం రావచ్చును, ఆఫలితాన్ని అనుభవిస్తే అదిపోతుంది. ఆఫలితాన్ని అనుభవించేటప్పడు వాసనపడుతుంది, వాసనలో నుండి తలంపు వస్తుంది, ఆ తలంపును బట్టి మరల పని చేస్తావు. ఇది అంతా కర్మచక్రం. ఈశ్వరానుగ్రహం ఉంటేగాని ఈచక్రంలో నుండి విడుదలపొందలేము. ఈదేహం కేవలం భోగం అనుభవించటానికి కాదు, తపస్సుకు ఈ దేహాన్ని ఉపయోగించుకొని అమృతానుభవంనుపొందు, జీవితానికి, మరణానికి బేధంలేని స్థితిని అందుకో. ఎప్పటికైనా నిష్కాముడు పవిత్రుడు అవుతాడు, వాడికి మోక్షానికి వెళ్ళేదారి తెలుస్తుంది కాని సకాముడికి తెలియదు. కర్మఫలంపట్ల వాంఛవద్దు. నువ్వుకోరకుండా వచ్చిన ఫలితం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది కాని చిత్తాన్ని అపవిత్రంచేయదు. ఆచార్యుల వారు ఏమిచెపుతున్నారు అంటే ఉన్నదేదో నీ హృదయంలోనే ఉంది, అది నీకు అనుభంలోనికి రావాలి. దానికి నీ మనస్సు యొక్క చాపల్యం తగ్గాలి. ఒక రూపాన్ని ఆరాధించినా, ఒకనామాన్ని జపించినా మనోనిగ్రహంకోసమే. నియమింపబడిన మనస్సుకు గాని లోచూపురాదు. లోచూపువస్తేగాని హృదయంలో ఉన్న సౌందర్యం తెలియదు అంటున్నారు. మనం భగవంతుడు చెప్పిన మాటలను ఏదో వింటున్నాము, ఇలా వింటే సరిపోదు, వాటిని మననంచేసుకోవాలి, వాటిని నీ మనస్సులో రాపాడించుకోవాలి. అలా మననంచేసుకోగా చేసుకోగా అది మనకు అనుభవంలోనికి వస్తుంది. ఏదైతే మనకు అనుభవంలో ఉందో అది మనకు సుఖాన్ని తీసుకొని వస్తుంది కాని మనకు అనుభవంలో లేనిది మనకి సుఖాన్ని తీసుకొనిరాలేదు. ఇతర జీవులకు లేని అవకాశం మానవజన్మకు ఉంది. పశువులు నిద్రపోతున్నాయి, మనం నిద్రపోతున్నాము, అవి ఆహారం తింటున్నాయి, మనమూ తింటున్నాము, వాటికి భయంవేస్తోంది మనకూ భయంవేస్తోంది కాని మనకు భగవంతుడు తెలివిని, వివేకాన్ని ఇచ్చాడు. ఆతెలివిని మనం భగవదనుభవంపొందటానికి ఉపయోగించుకోవాలి. మానవజన్మరావటమే కష్టం, మానవజన్మవచ్చిన తరువాత ముముక్షత్వంరావటం కష్టం, నీకు మోక్షాపేక్ష కలిగినా తదనుగుణంగా జీవించటానికి సహకరించే మహాత్ములు దొరకటం కష్టం. మనం పూర్వజన్మలో ఎంతోకొంత సత్కర్మచేసిఉంటేగాని, నిష్కామకర్మచేస్తేగాని సత్పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధినీకు కలుగదు. నాకు మోక్షం కావాలి, మోక్షం కావాలి అని వూరికే అనుకొంటావుగాని సాధనచెయ్యవు, ఎవరిని ఆశ్రయిస్తే మోక్షం తాలుక అనుభవం మనకుకలుగుతుందో వారిని ఆశ్రయించాలి అనే బుద్ధి నీకులేదు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని ఒకరు భగవాన్‌ను అడిగితే నువ్వు నేను, నేను అంటున్నావు కదా, అదే మూలతలంపు, ఆమూలతలంపు మూలంలోనే ఈశ్వరుడు ఉన్నాడు. వాడేనిజం, మిగతావన్నీ కల్పితాలు. ఆమూలతలంపును ఉపసంహరించి, ఉపసంహరించి వివేకాన్ని, వైరాగ్యాన్ని ఉపయోగించుకొని మూలతలంపును దానిమూలంలో ఉంచగలిగితే అదినశిస్తుంది. అది నశిస్తే నీవు నశించవు, నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

**05-9-2004**

**రమణ భాస్కర**

బ్రాహ్మీస్థితిని పొందు అర్జునా అని కృష్ణుడు అర్జునుడితో చెపుతాడు. బ్రహ్మం యొక్క స్వరూపం సుఖం, శాంతి, ఆనందం. బ్రాహ్మీస్థితిని పొందకుండా దాని తాలుక సుఖం, శాంతినీకు అందదు. బ్రాహ్మీస్థితిని పొందటానికి మనకు ఉన్న శక్తిని, యుక్తిని, భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములన్నింటిని ఏకముఖంగా ఉపయోగించుకోవాలి. అప్పుడు మనం ఆవస్తువును పొందగలము. ఇక్కడ మనకు ఎవరికి మరణించాలని లేదు ఎందుచేతనంటే ఏ వస్తువుకయితే మరణం లేదో అది మనమై ఉన్నాము. మనకు ఎవరికి అశాంతిగా ఉండాలనిలేదు ఎందుచేతనంటే ఏవస్తువులో అయితే అశాంతిలేదో అది మనమై ఉన్నాము. మనకు ఎవరికీ దుఃఖం అంటే ఇష్టంలేదు ఎందుచేతనంటే ఏ వస్తువుకయితే దుఃఖం లేదో అది మనమై ఉన్నాము. మనం ఏదిగా ఉన్నామో అది మనం కోరుకొంటున్నాము. సాధన ద్వారా మనలను మనమే అన్వేషించుకొంటున్నాము, మనలను మనం తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు అంటే ఎవరిని తెలుసుకోమని, అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకో. సాధన అంటే ఏమీ లేదు లోపలఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటమే సాధన. బ్రాహ్మీస్థితిని పొందినవాడు ఎవరైనావచ్చి మాట్లాడినా, మాట్లాడకపోయిన అలాగే ఉంటాడు, శరీరం ఉన్నా అలాగే ఉంటాడు, శరీరం పోయినాఅలాగేఉంటాడు, యుద్ధం మధ్యలో ఉన్నా అలాగే ఉంటాడు, ఇంట్లో కూర్చొన్నా అలాగే ఉంటాడు. ఈసృష్టిస్థితిలయాలతోగాని, ప్రకృతికి సంబంధించిన విషయాలతోగాని బ్రాహ్మీస్థితిపొందినవాడికి పనిలేదు. నువ్వు ఏదైతేకాదో అదే నేను అనే భావన గట్టిగా మనకు నాటుకుపోయింది. అది సత్యం కాదు అది అసత్యం. అసత్యంలోనుండి దుఃఖం వస్తుంది. నువ్వు నిజస్థితిలో ఉంటే నీకు దుఃఖంరాదు, నువ్వు అనిజస్థితిలో ఉన్నావు కాబట్టి దుఃఖం వస్తోంది. నువ్వు దుఃఖం వచ్చినప్పడు రావద్దు, రావద్దు అని దానిని రిజెక్టుచేస్తున్నావు ఎందుచేతనంటే నీ స్వరూపంలో దుఃఖంలేదు. మీరు నాలుగువేదాలు చదువుకొన్నారు అనుకోండి, మీ ఇంటినిండా ధనం ఉంది అనుకోండి అన్నీ బాగున్నా మీకు దుఃఖంవస్తోంది అనుకోండి వాటి వలన లాభంలేదు. దుఃఖంవస్తే అది పీడించేస్తుంది, మనస్సులో ఒక విధమైన మంట వచ్చేస్తుంది. అప్పడు నీవు వేదపండితుడవు అయితే ప్రయోజనం ఏముంది? నీకు ధనం ఉంటే ప్రయోజనం ఏముంది? మానవుడు దుఃఖరహితస్థితినిపొందాలి, అది నీహృదయంలోనే ఉంది, దానిని పొందటానికి ప్రయత్నించు. మనం మనోదేహములతో తాదాప్యం వదులుకొన్నప్పడు మనహృదయంలో ఉన్నశాంతి సుఖం పొంగివచ్చి నీసహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పడు ఎటుచూసినాశాంతే, ఎటుచూసినా ఆనందమే. ఈశరీరం భూమిమీద తిరుగుతూ ఉండగానే అటువంటి అనుభవాన్ని పొందటానికి ప్రయత్నంచెయ్యి, నీకు మోక్షం కావాలి అంటే సరిపోదు తదనుగుణంగా నీవు ప్రయత్నంచేయాలి, అధ్యయనం చేయాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి. మీకు ఏదైనా గర్వం తెచ్చుకొనే కారణం ఉన్నా గర్వం తెచ్చుకోవద్దు, అలా గర్వంతెచ్చుకొంటే మరల దానిని పోగొట్టుకోవటానికి అనేక జన్మలు సాధనచేయవలసి ఉంటుంది. కొంతమంది చిన్నమాట అంటేపడరు. చిన్నమాటఅంటే పడలేనప్పడు, ఆ సహించేశక్తి మీకు లేనప్పడు మీకు లోచూపు ఎలా కలుగుతుంది, కలుగనేకలుగదు. అందుచేత మనం నిర్మలంగా, నిశ్చలంగా, కూల్‌గా ఉండాలి. దేహప్రారబ్ధాన్ని బట్టి మనకు అనుకూలమైన పరిస్థితులు, ప్రతికూలమైన పరిస్థితులు ఎదురవుతాయి, వాటిని కంప్లీట్‌గా దేహానికి వదిలెయ్యి. నువ్వు ఈ భూమిమీదకు వచ్చిన పని ఏదో అదిచూసుకో, మనకు లోపలఉన్న సద్వస్తువు తెలియకపోయినా దేహము, మనస్సు తెలుస్తున్నాయి కదా, ఈమనోదేహములను ఆత్మజ్ఞానసముపార్జనకు ఉపయోగించుకో అలా ఉపయోగించుకోవాలంటే శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం ముఖ్యం. అవిరెండూ కాపాడుకొంటూ ఆత్మజ్ఞానసముపార్జనకు మనోదేహములను ఉపయోగించుకో, నువ్వు ఏదిగా ఉన్నావో దానిని పొందటానికి మనోదేహములను ఉపయోగించుకోకుండా వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని చిల్లరగొడవలకి, అల్పవిషయాలకు నీ మనోదేహములను ఉపయోగిస్తే జీవితంలో నీవు చాలానష్టపోతావు. ఈశరీరంచనిపోయేలాగ గుణాతీతుడవు అవ్వలేదు అనుకో, నువ్వు ముక్తిస్థితినిపొందలేదు అనుకో, మిగతావి ఏవి సాధించినా అవిఅన్నీ ఒకటిలేని సున్నలతో సమానము.

సాధనఅంటే మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన ఏకాగ్రతను పాడుచేసుకోకూడదు, శాంతచిత్తమును కాపాడుకోవాలి అప్పడు ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. నంది చూపు ఈశ్వరుడు వైపుకు ఎలా ఉంటుందో అలాగ మన చూపు ఎప్పడూ ఈశ్వరుడు మీద ఉండాలి. ఈశ్వరునిపొందటానికి మన సర్వశక్తులు వినియోగించాలి. మనయుక్తి, శక్తి అన్నీ అటే ప్రవహిస్తూఉండాలి. ప్రయత్నం, సహనం ఈరెండింటి వలన నీకు విజయం కలుగుతుంది. సత్పురుషులతో సహవాసం చేయటం వలన భగవదనుభవం పొందటానికి ప్రయత్నంచేయాలనే బుద్ధిమనకు కలుగుతుంది. ఒక మహాత్ముడి సన్నిధిలో కూర్చొంటే ఆయనపొందినది మనకు పూర్తిగా తెలియకపోయినా మనంకూడా పొందాలనే జిజ్ఞాస కలుగుతుంది. భగవాన్ చెపుతూ

ఉండేవారు ఇక్కడకు వచ్చినవారు ఎవరూ వట్టిచేతులతో వెళ్ళరు, నాస్తికులు ఆస్తికులు అవుతారు ఆస్తికులు భక్తులవుతారు, భక్తులు జ్ఞానులవుతారు అని చెప్పేవారు. నువ్వు గురువు దగ్గరమాట్లాడేటప్పుడు మధురంగా ఉండాలి, గౌరవంగా మాట్లాడాలి, ఆయన చెప్పినది శ్రద్ధగా వినాలి, విన్నదానినిమననం చేసుకోవాలి, ఆవాక్యాన్ని ధ్యానం చేయాలి, నిరాకారుడూ ఈశ్వరుడే, సాకారుడూ ఈశ్వరుడే అయితే ఆకారం ఎందుకంటే మనకు ఉపాసనకోసం. మనశరీరాన్ని తీసుకొని వెళ్ళి ఆయనదగ్గరపెట్టటంకాదు, మనమనస్సును ఆయన మీదపెట్టాలి. మనమనస్సును తీసుకొని వెళ్ళి ఆధ్యాత్మికహృదయంలో ఉంచాలి, అదే ఉపాసన, అదేసాధన. నేను శరణాగతి చేసాను కాని నాకు దుఃఖంవస్తోంది ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. వాడునోటితో శరణాగతిపొందాను అని చెపుతున్నాడు కాని లోపల శరణాగతి పొందలేదు. దుఃఖంవచ్చేనేను ఎవరు అని భగవాన్ అడుగుతున్నారు. ఈ నేనునే కదా శరణాగతి చేయాలి మరి ఎవరిని శరణాగతిచేసావు. నీ శరణాగతి నిజమైతే ఈ నేను హృదయంలో అణిగిపోతుంది. ఈ నేను ఎక్కడైతే ఉదయించి వచ్చిందో అక్కడ అణిగితే అప్పడు నీవు సుఖపడతావు. ఈప్రపంచం యొక్క కథఅంతా, నీ అహంకారం యొక్క కథ అంతా హృదయంలోనుండి బయలుదేరుతుంది. హృదయంలోనుండి మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక లోకం వస్తోంది, లోకం వచ్చాక దేవుడు వస్తున్నాడు. శరణాగతిమార్గంలో కాని, విచారణామార్గంలోకాని, నీవు ఏదో ఒకమార్గంలో ప్రయాణంచేసి నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచగలిగితే పంచదారబొమ్మను నీటిలో వేస్తే ఎలా కరిగిపోతుందో అలాగ నీ మనస్సు హృదయంలో కరిగిపోయి, హృదయంలో లయమయిపోతుంది. అప్పడు అక్కడ ఉన్న బ్రహ్మంనీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. దేవుడు మనిషిని కల్పించాడా, మనిషిదేవుడిని కల్పించాడా అని అడుగుతున్నారు. వాడు వీడిని కల్పించలేదు, వీడు వాడిని కల్పించలేదు, ఈరెండూవ్యవహారికసత్యాలు. మీరు రాముడికి భక్తులు అయినా కృష్ణుడికి భక్తులు అయినా, ఏసుక్రీస్తుకు భక్తులయినా, అల్లాకు భక్తులయినా మీరు ఏకులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా మీరు ప్రకృతిగుణాలను అతిక్రమించకపోతే, జీవలక్షణాలను అతిక్రమించకపోతే జననమరణచక్రం నుండి విడుదలపొందలేరు. మోక్షాన్నిపొందలేరు. ఏదైతే సత్యమో అదేజ్ఞానం, ఏదైతే జ్ఞానమో అదే ఆనందం, ఏదైతేఆనందమో అదే అనంతం, అది నీ హృదయంలోనే ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకో. ఈ శరీరం ఉండగానే ఎవడైతే జీవలక్షణాలను తొలగించుకొన్నాడో, ఎప్పడైతే అహంకారం, మమకారంల నుండి విడుదలపొందాడో అప్పడు జీవుడు



అంటూలేడు, అంతానువ్వే ఉంటావు. అంతటానీవే ఉన్నప్పడు ఇంకరాకలేదు, పోకలేదు, అదే నిర్వాణస్థితి. అటువంటి నిర్వాణస్థితిని పొందటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అని బుద్ధుడు చెప్పాడు. నీకు జ్ఞానసముపార్జనకు దారి చూపించే తల్లే తల్లి, నిన్ను తరింపచేయటానికి మార్గంచూపించే తండ్రే తండ్రి అని ప్రహ్లాదుడు చెప్పాడు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 08-08-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడి యొక్కఅవతారములలో శివుడు, కృష్ణుడు ఇవి రెండూ ముఖ్యమైనవి. ఈ రెండు అవతారములు స్వయంభువు అంటే వారంతట వారేవ్యక్తమయ్యారు. దేవుడికి కారణం ఏమిటి అంటారు, దేవుడికి కారణం ఉంటే ఆయనదేవుడు అవ్వడు. అన్ని కారణాలకు కారణమే దేవుడు. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినది ప్రాక్టికాలిటీ. చేతిలో ఉన్నపనిని విడిచిపెట్టిపారిపొమ్మని, జీవితాన్ని విడిచిపెట్టి పారిపొమ్మని ఆయన ఎక్కడా చెప్పలేదు. జీవితంలో మనకు మంచి ఎదురవుతుంది, చెడు ఎదురవుతుంది. ఎన్ని ఎదురైనప్పటికి వాటిని పేస్ చెయ్యండి, అంతేగాని వాటినుండి పారిపోవద్దు అని భగవంతుడుచెప్పాడు. ఇది అంతా కాలక్షేపంకోసం కాదు, జీవితంలో మీకువచ్చే కష్టసుఖాలను ఎదుర్కొనేశక్తిని మీరు అలవాటు చేసుకోవాలి. ఏఈశ్వరుడు అయితే మనబుద్ధికి సాక్షిగా ఉన్నాడో ఆయనే కృష్ణరూపం ధరించాడు. జీవితాన్ని అనేకకోణాలనుండి పరిశీలించి ఆయన ఈమాటలు చెప్పాడు. ప్రతీ మనిషికి జీవితంలో ఒకోసారిలాభం, ఒకోసారి నష్టంవస్తుంది. ఒకోసారి అదృష్టం, ఒకోసారి దురదృష్టం వెంటాడుతుంది. జీవితంలో ద్వంద్వాలు ఉంటాయి, వీటిని చూచి నీవు కంగారుపడవద్దు. ఈద్వంద్వాలను అర్ధంచేసుకొని, వీటిని ఆధారంగా చేసుకొని నిన్ను నీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి అని భగవంతుడు చెప్పాడు. మనకు జయం వస్తే పొంగిపోతున్నాము అనుకోండి, అపజయం వస్తే కుంగిపోతున్నాము అనుకోండి మనలను మనం తెలుసుకొనే అవకాశంరాదు. పనిపట్ల కర్తృత్వభావన ఉండకూడదు. కొంతమంది పుణ్యం వస్తుంది అంటే పనిచేస్తారు లేకపోతే చేయరుఅలాకాదు. అది మంచిపని అనుకొంటే చెయ్యి దానివలన పుణ్యం రావచ్చు, రాకపోవచ్చు, నేను ఆపని చేసాను, ఈపని చేసాను ఇలా అనుకోవటం మానివెయ్యి, ఇలా అనుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. జీవితంలో వచ్చే సంఘటనల నుండి పారిపోవద్దు, ఆసంఘటనలను అర్థంచేసుకొంటే నిన్ను నీవు తెలుసుకోవటానికి ఆసంఘటనలు ఉపయోగపడతాయి. నన్ను తెలుసుకో అని కృష్ణుడు చెపుతూఉంటాడు, అక్కడ నన్ను